

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 504.80 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది.



భావదేవునికి చక్రస్నానం

బాపట్ల: శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మి సమేత శ్రీ క్షీరభావనారాయణస్వామి 1431వ నవాహ్నిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం చక్రస్నానం నిర్వహించారు.



కంచి పరమాచార్య జయంతి

నగరంపాలెం: గుంటూరు బృందావన్‌గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో కంచి పరమాచార్య చంద్రశేఖరేంద్ర సరస్వతి జయంతి శుక్రవారం నిర్వహించారు.

న్యూస్‌రీల్

సజావుగా ఆన్‌లైన్ డీసెట్

గుంటూరు ఎడ్యుకేషన్ : డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (డీసెట్) ఆన్‌లైన్‌లో శుక్రవారం సజావుగా జరిగింది. విద్యాశాఖ ఆధ్వర్యంలో గుంటూరు రూరల్ నల్లపాడులో ఏర్పాటు చేసిన రెండు ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాల్లో రెండు రోజుల పాటు జరగనున్న డీసెట్‌లో భాగంగా మొదటి రోజున కేటాయించిన 384 మంది అభ్యర్థులకు 330 మంది హాజరయ్యారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష సజావుగా నిర్వహించినట్లు డీఈవో పి.శైలజ తెలిపారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

ఏపీ ఎస్పీ రేంజ్ డీఐజీ రాజకుమారి



తాడేపల్లిరూరల్ : చిన్నారులు మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని ఏపీ ఎస్పీ రేంజ్ డీఐజీ రాజకుమారి అన్నారు. శుక్రవారం చినకాకాని షైన్ ఆనంద శరణాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులతో మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కూడా చదువుకునే అవకాశాలు లేనప్పుడు కొంతమంది ఆయనకు సహకరించారని, ఆయన భారత రాజ్యాంగ నిర్మాతగా దేశానికి దిక్సూచి అయ్యారని చిన్నారులకు వివరించారు. చిన్నారులు అలాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకుని దేశం గర్వించదగ్గ పౌరులుగా ఎదగాలని అన్నారు. అనంతరం కుమార్తె దాసరి చెన్నసుమ జన్మదినోత్సవం సందర్భంగా చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో షైన్ ఫౌండేషన్ చైర్మన్ డీజీ నాయక్, శరణాలయం నిర్వాహకురాలు సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో దరఖాస్తులకు ఆహ్వానం



ప్రిన్సిపాల్ సింహాద్రి మోహన్

రెంటచింతల: స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల(బాలుర)లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి ప్రవేశం కోసం దరఖాస్తులకు ఆహ్వానం పలుకుతున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సింహాద్రి మోహన్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 5వ తరగతికి 40 సీట్లు కేటాయించడం జరిగిందని ఈ ఖాళీలను రోస్టర్ విధానంలో భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఎస్టీ–32, ఎస్సీ–5, బీసీ–2, ఓసీ–1 కేటాయించారన్నారు. అర్హులైన విద్యార్థులు జూన్ 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తమ దరఖాస్తులను స్థానిక పాఠశాలలో అందజేయాలని కోరారు. దరఖాస్తులతో పాటు విద్యార్థి ఆధార్ కార్డు జిరాక్స్, తల్లిదండ్రుల ఆధార్ కార్డుల జిరాక్స్‌లు, రేషన్ కార్డు నకలు, తల్లి బ్యాంక్ ఎకౌంట్ జిరాక్స్ జతచేసి పాఠశాలలో అందజేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు జూన్ 15వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించి రోస్టర్ విధానంలో ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 83339 25177లో సంప్రదించాలన్నారు.

జిల్లా జనన, మరణ రిజిస్ట్రార్‌గా డీఎంహెచ్‌ఓ

గుంటూరుమెడికల్: జనన, మరణ ధృవీకరణ పత్రాలు జారీచేసే జిల్లా రిజిస్ట్రార్ బాధ్యతలు డీఎంహెచ్‌ఓకు అప్పగిస్తూ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆసుపత్రుల్లో పుట్టిన పసికందులకు 30 రోజుల్లోపు మెడికల్ ఆఫీసర్లు సర్టిఫికెట్లు అందజేస్తారు. 30 రోజులుదాటి సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేస్తే తహసీల్దారు వాటిని పరిశీలించి మంజూరు చేస్తారు. ఇక నుంచి తహసీల్దారు వద్దకు వెళ్లే పనిలేకుండా 30 రోజులు గడువు దాటిన బర్త్, డెత్ సర్టిఫికెట్లు జిల్లా రిజిస్ట్రార్‌గా డీఎంహెచ్‌ఓ మంజూరు చేసేలా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మీరాధిక తొలగింపు

గుంటూరుమెడికల్: గుంటూరు జీజీహెచ్ నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మీరాధికను తొలగిస్తూ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నర్సింగ్ స్కూల్‌లో సీనియర్ ఫ్యాకల్టీగా ఉన్న సుజాతను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. లక్ష్మీరాధిక నర్సింగ్ విద్యార్థుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా యూనిఫామ్, పుస్తకాల కోసం రూ.8 వేలు వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆరోపణలపై విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు ఆమెకు ఈనెల 22న చార్జి మెమో ఇచ్చారు. తాజాగా ఆమెను ప్రిన్సిపాల్ బాధ్యతల నుంచి తొలగిస్తూ సూపరింటెండెంట్ ఉత్తర్వులు ఇచ్చారు.

బల్లికురవ కళాశాల భళా

- ఈ ఏడాది ఫలితాల్లో జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం
- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు
- ఎన్‌ఆర్‌ఈజీఎస్, నాబార్డు, నాడు–నేడుతో రూ.1.5 కోట్లతో భవనాలు
- అభివృద్ధి పథంలో కళాశాల
- పేద విద్యార్థులకు చేయూతనిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు
- ఆగస్టు నుంచి ఉదయం, సాయంత్రం స్టడీ అవర్లు



బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాల

బల్లికురవ: ఒత్తిడి లేని విద్య అందిస్తూ అధ్యాపకుల స్వీయ పర్యవేక్షణలో బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాల జిల్లా, రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చుకుని రెండున్నర దశాబ్దాలుగా అత్యుత్తమ ఫలితాలు సాధిస్తోంది. ప్రభుత్వం బల్లికురవకు 24 మే 2001న జూనియర్ కళాశాల మంజూరు చేసింది. రెండేళ్లు ఉన్నత పాఠశాలలోనే పాకలలో కళాశాల నిర్వహించారు. అభివృద్ధి కమిటీ కృషితో బల్లికురవ నుంచి అద్దంకికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుకు తూర్పు భాగంలో సుమారు 11 ఎకరాల భూమి దాతల నుంచి సేకరించారు. 2004లో రూ.20 లక్షలతో నాలుగు గదులు, 2018లో నాబార్డులో రూ. కోటితో ఏడు గదులు, నాడు–నేడు రెండో దశలో రూ.27 లక్షలతో ఈ భవనాలకు విద్యుత్, ఫ్లోరింగ్, టాయిలెట్స్ ఆర్‌వో వాటర్ స్కీమ్, విద్యార్థులకు డ్యూయల్ డెస్క్ పనులు పూర్తయ్యాయి. పెయింటింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. ల్యాబ్‌లో అన్ని రకాల ఎక్విప్‌మెంట్ అందించారు.

నిరంతర పర్యవేక్షణ

కళాశాలలోని సీఈసీ, ఎంపీసీ, బైపీసీ తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో 90 నుంచి 100 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రిన్సిపాల్, 10 మంది అధ్యాపకులు ముగ్గురు నాన్ టీచింగ్ సిబ్బంది ప్రతి సంవత్సరం విద్యకు చేయూతనిస్తున్నారు. విద్యార్థి కళాశాలకు గైర్హాజరైతే ఆ క్లాస్ ఇన్‌చార్జి పేరెంట్‌కు వెంటనే తెలియచేయడం వల్ల గైర్హాజరు శాతం తగ్గుతోంది.



విద్యార్థుల కోసం ఇంటింటా క్యాంపెయిన్

విద్యా సంవత్సరంలో రెండుసార్లు కళాశాలలో పేరెంట్స్ సమావేశంతో విద్యార్థి ప్రోగ్రెస్ తెలియజేస్తున్నారు. ఆగస్టు మొదటివారం నుంచి ఫిబ్రవరి వరకు ఉదయం సాయంత్రం షెడ్యూల్ ప్రకారం స్టడీ అవర్లతో వీక్లీ స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నారు.

ప్రైవేట్ కళాశాలలతో పోటీ

జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ ఫలితాలతో ప్రైవేట్ కళాశాలలతో పోటీ పడుతున్నారు. ఈ ఏడాది ఇంటర్ రెండో సంవత్సరంలో పుట్టంరాజు దత్తసాయిశ్రీ సీఈసీ గ్రూపులో వెయ్యికి 913 మార్కులతో జిల్లా స్థాయిలో ప్రథమ, కందుకూరి సాగరిక 912 మార్కులతో రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. బైపీసీ నుంచి జీ.శ్రీనివాసరాజు 818 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం సీఈసీలో 500కు 405 మార్కులను జె.చినరామయ్య ఎంపీసీలో 470కి 404 మార్కులను సరిత కైవసం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.అనిల్ కుమార్ తెలిపారు.

అధ్యాపకుల దాతృత్వం

అధ్యాపకులు గుంటుపల్లి పార్థసారథి, షేక్ హుస్సేన్‌లు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన వారికి ప్రతి ఏటా ఆగస్టు 15న రూ.2 వేలు చొప్పున ఇస్తున్నారు. ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపక బృందం ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరాల్లో ప్రతి గ్రూపులో రెండు మీడియంలలో అత్యధిక మార్కులు సాధించిన వారికి వెయ్యి రూపాయల చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందిస్తూ విద్యార్థులకు చేయూతనిస్తున్నారు. వచ్చే ఏడాది నుంచి ప్రతి ఏటా 13 మంది విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి, ఫీజులు, బస్సు చార్జీలు వగైరాలు అందించనున్నారు. ప్రిన్సిపాల్, అధ్యాపకుల బృందం ఏప్రిల్ 19 నుంచి బల్లికురవ, కొత్తపాలెం, గుంటుపల్లి, అంబడిపూడి, వల్లాపల్లి, నక్కబొక్కలపాడు, కొణిదెన, కొత్తమల్లాయపాలెం, పాతమల్లాయపాలెం, కొప్పరపాలెం, కొండాయపాలెం, చెన్నుపల్లి గ్రామాల్లో ఒక విడత క్యాంపెయిన్ పూర్తి చేశారు. రెండో దశ ప్రారంభిస్తామని ప్రిన్సిపాల్ వివరించారు.

స్టడీ బాగుందని తెలిసి చేరా..



బల్లికురవ కళాశాలలో స్టడీ బాగుందని తెలిసి 2022–23 విద్యా సంవత్సరం జూన్‌లో సీఈసీ గ్రూపులో చేరాను. మాది సంతమాగులూరు మండలం కుందుర్రు గ్రామం. ఐదు కిలోమీటర్లు ఉంటుంది. ఉదయం 7 గంటలకు బస్సు ఎక్కితే రాత్రి 7 గంటలకు ఇంటికి చేరేదాన్ని. అధ్యాపకుల బోధన వల్ల 913 మార్కులతో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నా. ప్రభుత్వ కళాశాలలో బోధన చాలా బాగుంది.

– పుట్టంరాజు వెంకటదత్త సాయిశ్రీ

మా అమ్మాయిని తీర్చిదిద్దారు



మాది బల్లికురవ. 10వ తరగతితో నా కుమార్తె సాగరిక చదువు ఆపి వివాహం చేద్దాం అనుకుంటే.. ప్రిన్సిపాల్, అధ్యాపకులు మా ఇంటికి వచ్చి మీ అమ్మాయికి మంచి మార్కులు వచ్చేలా బోధిస్తాం అంటూ భరోసా ఇచ్చారు. సీఈసీలో 912 మార్కులతో జిల్లా స్థాయిలో రెండో స్థానం దక్కేలా తీర్చిదిద్దారు. ప్రభుత్వ కళాశాలలో విద్యా బోధన చాలా బాగుంది.

– కందుకూరి సాగరిక తండ్రి నజరేత్

ప్రహరీ నిర్మిస్తే బాగుంటుంది



కళాశాలలో తరగతి గదులు, ల్యాబ్, ఆర్‌ఓ ప్లాంట్ మౌలిక వసతులు బాగున్నాయి. తూర్పు, ఉత్తర, పడమర భాగాల్లో ప్రహరీ లేనందున విద్యార్థుల స్టడీ అవర్లలో పశువులు, ప్రజలు తిరుగుతున్నారు. ఇక్కడ పనిచేస్తున్న స్టాఫ్ బాగా పనిచేయడం వల్లే మంచి ఫలితాలు సాధించగలుగుతున్నాం. ప్రహరీ నిర్మిస్తే ఇంటర్ పరీక్షల సెంటర్ ఇచ్చే అవకాశం ఉంది.

– అనిల్ కుమార్, ప్రిన్సిపాల్

ముందస్తుగా నిర్ణయించిన వ్యక్తులకే కేంద్రంలోకి అనుమతి

జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా



స్ట్రాంగ్ రూములను పరిశీలిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల: ఓట్ల లెక్కింపు కేంద్రాలలోకి ముందస్తుగా నిర్ణయించిన వ్యక్తులను మాత్రమే అనుమతించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూములను జిల్లా ఎన్నికల అధికారి రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ కలిసి శుక్రవారం పరిశీలించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి చెప్పారు. స్ట్రాంగ్ రూముల వద్ద ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల నిఘా నిరంతరం కొనసాగాలన్నారు. విధులకు నియమించిన అధికారులు, సిబ్బందికి ఒక మార్గం, అభ్యర్థులు వారి ఏజెంట్లు వెళ్లడానికి వీలుగా మరొక మార్గాన్ని ఏర్పాటు చేయాలన్నారు. మార్గాల వద్ద దిక్సూచీ బోర్డులను స్పష్టంగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కేంద్రాలలో వీడియోగ్రఫీ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఆర్వోలు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట జిల్లా అదనపు ఎస్పీ విఠలేశ్వరరావు జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు పర్చూరు, రేపల్లె, వేమూరు ఆర్వోలు జి.రవీందర్, వసంతరాయుడు, హేలా షారోన్, తదితరులు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2500, గరిష్ట ధర రూ.4500, మోడల్ ధర రూ.3400 వరకు పలికింది.

ఏపీపీఎస్సీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- డీఆర్‌ఓ సత్తిబాబు
- పరీక్షల నిర్వహణపై సమీక్ష



మాట్లాడుతున్న డీఆర్వో సీహెచ్ సత్తిబాబు

బాపట్ల: డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఇన్ ఏపీ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ఉద్యోగాలకు ఏపీపీఎస్సీ చేపట్టే పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు అన్నారు. ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓ చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈనెల 25వ తేదీన జరిగే ఏపీపీఎస్సీ పరీక్షకు జిల్లాలో 200 మంది అభ్యర్థులు హాజరు కాబోతున్నారన్నారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. చీరాల పరిధిలోని సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష నిర్వహణకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, క్యాలిక్యులేటర్, ట్యాబ్స్, ఐప్యాడ్, బ్లూటూత్ వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, హ్యాండ్‌బ్యాగులు, రైటింగ్ ప్యాడ్లకు అనుమతి లేదన్నారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. విద్యుత్తు సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్లు జయంతి, విజయ నిర్మల, వేటపాలెం తహసీల్దార్ కృష్ణకాంత్, ఉప తహసీల్దార్ భాగ్యరాజు, వైద్య ఆరోగ్య శాఖ నుంచి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆవిరైన ఆశల దీపం

- రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి
- ఎస్‌ఎల్ గుడిపాడులో విషాదచాయలు



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన జగదీష్

బల్లికురవ: మొక్కజొన్నలు కొనుగోలు చేసి ట్రాక్టర్‌కు లోడ్ చేసుకుని వెళుతుండగా వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో ఓ విద్యార్థి అక్కడికక్కడే చనిపోగా ట్రాక్టర్ డ్రైవర్ గాయాల పాలయ్యాడు. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి నార్కెట్‌పల్లి– మేదరమెట్ల నామ్ రహదారిలోని అద్దంకి మండలం శ్రీనివాసనగర్ సమీపంలో జరిగింది. అందిన సమాచారం ప్రకారం.. బల్లికురవ మండలం ఎస్‌ఎల్ గ్రామానికి చెందిన కల్లూరి పెద్దబ్బాయి, కోటేశ్వరరమ్మ, దంపతులకు కుమారుడు జగదీష్(14) కుమార్తె లక్ష్మీప్రియ ఉన్నారు. వంగులూరు మండలం ముప్పవరంలోని పెద్దబ్బాయి.. అక్క నరసమ్మకు గ్రామంలో 30 క్వింటాళ్ల మొక్కజొన్న విత్తనాలు కొనుగోలుచేసి గురువారం రాత్రి ట్రాక్టర్ లోడ్ చేసుకుని శింగరకొండ మీదుగా ముప్పవరం బయలుదేరారు. డ్రైవర్ రావులపల్లి రవి పక్కనే ట్రాక్టర్‌పై జగదీష్ కూర్చున్నాడు. ఇంతలోనే లారీ ఢీకొట్టడంతో జగదీష్ అక్కడికక్కడే చనిపోగా రవి గాయపడ్డాడు. స్థానికులు అద్దంకి 108కి సమాచారం ఇవ్వటంతో రవిని నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

విలపిస్తున్న కుటుంబ సభ్యులు

పెద్దబ్బాయికి పదేళ్ల కిందట రెండు కాళ్లు చచ్చుపడిపోగా ఏపని చేయలేడు. కొద్దిపాటి పొలం ఉంది. తమ కష్టాలు పిల్లలకు రాకూడదని తల్లి కోటేశ్వరమ్మ పొలం పనితోపాటు గేదెలను మేపుకుంటూ బిడ్డలను చదివిస్తోంది. కుమారుడు రోడ్డు ప్రమాదంలో చనిపోవటంతో తల్లిదండ్రులు, అక్క, బంధువులు విలపిస్తున్నారు. పోస్టుమార్టం తదుపరి శుక్రవారం సాయంత్రంఅంత్యక్రియలు జరిపారు.

ఓట్ల లెక్కింపులో అప్రమత్తంగా ఉండాలి

జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా

బాపట్ల : పోస్టల్ బ్యాలెట్, ఈటీపీబీఎస్ ఓట్ల లెక్కింపులో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్ బాషా అన్నారు. పోస్టల్ బ్యాలెట్, ఈటీపీబీఎస్ ఓట్ల లెక్కింపు ప్రక్రియపై అధికారులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. పోస్టల్ బ్యాలెట్, ఈటీపీబీఎస్ ఓట్ల లెక్కింపు బాధ్యత ఏఆర్‌ఓలదేనని స్పష్టం చేశారు. అపోహలు, నిర్లక్ష్యం ఉండరాదని అధికారులకు సూచించారు. అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కేంద్రాలలోనే పోస్టల్ బ్యాలెట్, ఈటీపీబీఎస్ ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ప్రతి నియోజకవర్గంలో సగటున రెండు వేలకు పైగా ఓట్లు ఉన్నాయన్నారు. పోస్టల్ బ్యాలెట్, ఈటీపీబీఎస్ ఓట్ల లెక్కింపు మూడు రౌండ్స్‌లో పూర్తిచేయాల్సి ఉంటుందన్నారు. బ్యాలెట్ పత్రాలున్న కవర్లను స్కానింగ్ చేసే సమయంలో చాలా అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. ఈసీ నిబంధనలు తెలుసుకుని వాటినే అనుసరించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ పత్రాల పరిశీలన సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆర్వో హ్యాండ్‌బుక్‌లను ఏఆర్‌ఓలు అధ్యయనం చేయాల్సి ఉందన్నారు. ఈసీ మార్గదర్శకాలపై అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని చెప్పారు.

రెచ్చిపోతే లాఠీతో వాతే!



మాబ్ డ్రిల్ కార్యక్రమంలో ప్రత్యేక పోలీసు బృందాలతో ఏఎస్పీ విఠలేశ్వర్, డీఎస్పీ ప్రసాద్, సీఐలు, సిబ్బంది



ఆందోళనకారులపై లాఠీ చార్జి చేస్తున్న పోలీసులు

- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించం.
- ఓట్ల లెక్కింపు సమయంలో 144 సెక్షన్, 30 యాక్టు
- ఆకట్టుకున్న పోలీస్ మాబ్ డ్రిల్

చీరాల: నిత్యం జనంతో రద్దీగా ఉండే చీరాల గడియార స్తంభం సెంటర్ శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా ఆందోళనకారులు (పోలీసులే) పెద్ద ఎత్తున గుమికూడారు. పరిస్థితి ఉద్రిక్తంగా ఉన్న తరుణంలో పోలీసులు లాఠీలకు పని చెప్పారు.. టియర్ గ్యాస్, వాటర్, ఆందోళనకారులపై పోలీసుల కాల్పులతో ఒక్కసారిగా జనం హడలిపోయారు. ఆందోళనకారులు (వేషాల్లో ఉన్న పోలీసులు) పోలీసులపై రాళ్లు రువ్వారు....ఖాళీ టైర్లు తగలబెట్టారు....పోలీస్ జులుం నశించాలి....డౌన్‌డౌన్ పోలీసులు అంటూ నినాదాలు చేస్తూ దాడులకు తెగబడ్డారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఏఆర్ పోలీసులు లాఠీఛార్జి చేశారు. ఆందోళనకారులు ఆందోళన విరమించకపోవడంతో వాటర్ కొట్టారు. ఇంకా ఆందోళనకారులు పెద్దఎత్తున నినాదాలు చేసి పోలీసులపైనే దాడులకు పాల్పడటంతో కాల్పులు కూడా జరిపారు. ఇదేదో సినిమా షూటింగ్ కాదు.. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై పోలీస్ మార్క్ ట్రీట్‌మెంట్. ఓట్ల లెక్కింపులో నాయకుల మెప్పు కోసం ఆందోళనలు, అల్లర్లు, విధ్వంసాలు చేస్తే పోలీసులు తీసుకునే చర్యలపై ప్రజలకు మాబ్ డ్రిల్ ద్వారా వివరించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశాల మేరకు.. జిల్లా అడిషినల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ ఆధ్వర్యంలో సివిల్, ఏఆర్, ప్రత్యేక పోలీసుల ఆధ్వర్యంలో ప్రజలను చైతన్యం చేసేందుకు మాబ్ డ్రిల్ చేశారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు ముందురోజు కౌంటింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. గుంపులు గుంపులుగా చేరిన వారిని కర్రలు, రాళ్లతో ఆందోళన చేస్తున్న వారిని ఆ ప్రాంతం నుంచి పంపించేందుకు ఓ వైపు మైకులో హెచ్చరికలు జారీ చేయడం, టైర్లు తగలబెట్టి విధ్వంసం చేసే వారిని తరిమి వేసేందుకు ఫోర్స్‌గా వాటర్ కొట్టడం...టియర్ గ్యాస్ విడుదల చేయడం, తీవ్ర ఉద్రిక్తంగా మారితే ఫైరింగ్ చేయడం, ఈ ఫైరింగ్‌లో గాయపడిన వారికి ప్రథమ చికిత్స చేయడం తదితర అంశాలను డ్రిల్ ద్వారా ప్రజలకు వివరించారు.

అలజడులు జరగకుండా చర్యలు

ఏఎస్పీ టీపీ విఠలేశ్వర్ మీడియాతో మాట్లాడుతూ ఎస్పీ వకుల్ జిందాల్ సూచనలతో జూన్ 4న జరిగే కౌంటింగ్ రోజున ఎలాంటి అలజడులు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. పట్టణ, రూరల్ గ్రామాల్లో పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందన్నారు. ప్రజలు శాంతియుతంగా ఉండాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా ఎవరైనా ప్రవర్తిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరు గెలిచినా, ఎవరు ఓడినా అందరూ ప్రశాంతంగా ఉండాలన్నారు. గెలిచిన వారు ఊరేగింపులు, బాణసంచా కాల్చడం నిషేధించామన్నారు. కార్యక్రమంలో చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్, ఒన్‌టౌన్, టూటౌన్ సీఐలు పి.శేషగిరిరావు, సోమశేఖర్, ఎస్సైలు శివకుమార్, సురేష్, పోలీసు సిబ్బంది, ఏఆర్ పోలీసులు, అధికసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ఆమంచిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- దళిత, ప్రజా సంఘాలు, వైఎస్సార్ సీపీ దళిత నాయకుల మండిపాటు
- డీఎస్పీ ప్రసాద్‌కు ఆమంచి క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్



సమావేశంలో దళిత, ప్రజా సంఘాలు, వైఎస్సార్ సీపీ దళిత నాయకులు

చీరాల రూరల్: దళిత పోలీసు అధికారి డీఎస్పీ బేతపూడి ప్రసాద్‌పై ఆమంచి కృష్ణమోహన్ చేసిన అనుచిత వ్యాఖ్యలు తగవని దళిత, ప్రజాసంఘాల, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన దళిత నాయకులు ఖండించారు. తక్షణమే ఆమంచిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి స్థానిక గోలి సదాశివరావు కల్యాణ మండపంలో దళిత, ప్రజాసంఘాలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోని దళిత నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. నాయకులు నల్లబోతుల మోహన్ కుమార్ ధర్మ, కట్టా గంగయ్య, కంచర్ల చిట్టిబాబు, గోసాల సుధాకర్, బడుగు విమలాకర్, తేళ్ల రాంబాబు, పార్టీ పట్టణాధ్యక్షుడు కొండ్రు బాబ్జి, మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, శిఖా సురేష్, యాతం మేరిబాబు, పిడతల అభిషేక్ మాట్లాడారు. ఎన్నికలకు సంబంధించి ఇటీవల జరిగిన కొన్ని సంఘటనల్లో డీఎస్పీ బేతపూడి ప్రసాద్ ఎంతో నిబద్ధతతో పనిచేసి ఎటువంటి అల్లర్లు, గొడవలు జరగకుండా తన విధులను నిర్వర్తించారని చెప్పారు. సముద్రతీర ప్రాంతంలో డబ్బులు పట్టుకున్న పోలీసులపై ఆమంచి అభాండాలు వేడయం సరైన పద్ధతి కాదని హితవు పలికారు. డీఎస్పీ చేస్తున్న మంచి పనులు గిట్టని ఆమంచి కృష్ణమోహన్ బాపట్లలోని ఎన్నికల పరిశీలకులు, పోలీసు పరిశీలకులకు.. డీఎస్పీపై ఫిర్యాదు చేసి బయటకు వచ్చిన అనంతరం డీఎస్పీని తన ఇష్టానుసారంగా అసభ్య పదజాలంతో తూలనాడారని చెప్పారు. సమావేశంలో బండికళ్ల నరేష్, వాసిమళ్ల వాసు, శ్రీను, యాతం సునీల్, మల్లెల రాజశేఖర్, సల్లూరి సత్యానందం, షేక్ సుభాని, ఈసర్ల రాజేంద్ర, చింతా శ్రీను, కోటి సుధ, గోర్రెముచ్చు సోని, తదితరులు పాల్గొన్నారు.

జారిపడి వృద్ధురాలి మృతి

బల్లికురవ: ఆలయంలో నిద్ర చేసేందుకు కుమార్తె, అల్లుడితో వచ్చిన వృద్ధురాలు మెట్లు దిగుతూ కిందపడి మృతి చెందిన ఘటన గురువారం మండలంలోని గొర్రెపాడు గ్రామంలోని అంకాలమ్మ ఆలయం వద్ద చోటు చేసుకుంది. పోలీసులు, మృతురాలి బంధువుల సమాచారం మేరకు.. ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం శంకరాపురం గ్రామానికి చెందిన మందలపు మంగమ్మ (77)కు కుమార్తె జాష్టి పుష్పాలు, కుమారుడు అర్జున్‌రావు ఉన్నారు. కుమార్తె మానసిక స్థితి సరిగా లేనందున అల్లుడు అంజయ్యతో కలిసి నాలుగు రోజుల క్రితం గొర్రెపాడు గ్రామంలోని ఆలయానికి వచ్చారు. ఆలయంలో పూజలు చేయించుకుంటూ అక్కడే ఉన్న సత్రంలో నిద్రిస్తున్నారు. సత్రం మేడపైన దుస్తులు ఆరవేసి తీసుకువచ్చేందుకు వెళ్లగా మంగమ్మ కాలుజారి మెట్లపై నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. శుక్రవారం ఘటనా స్థలాన్ని సంతమాగులూరు సీఐ కె.నరసింహారావు, బల్లికురవ పోలీసులు పరిశీలించారు. కుమారుడు అర్జున్‌రావు ఫిర్యాదు మేరకు పోలీస్ స్టేషన్ రైటర్ ఆంజనేయులు కేసు నమోదుతో పోస్టు మార్టం నిమిత్తం మంగమ్మ మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కాల్వలో వృద్ధురాలి మృతదేహం లభ్యం



బాపట్లటౌన్: మండలంలోని కొండుబొట్లవారి పాలెం సమీపంలోని నాగరాజు కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. రూరల్ సీఐ శ్రీహరి వివరాల మేరకు.. సుమారు 60 సంవత్సరాలు వయసు కలిగిన వృద్ధురాలి మృతదేహం నాగరాజు కాలువలో కొట్టుకురావడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కేబీ పాలెం వీఆర్వో ఫిర్యాదు మేరకు సీఐ శ్రీహరి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని వేజండ్ల మణిపురం (మిక్స్ కేబిన్) వద్ద గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. సుమారు 35 సంవత్సరాల వయస్సు కలిగిన ఓ వ్యక్తి వేజండ్ల–మణిపురం రైల్వే స్టేషన్ మధ్యలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న జీఆర్పీ ఎస్ఐ వెంకటాద్రి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరసర ప్రాంతాల్లో దర్యాప్తు చేశారు. వివరాలు తెలియకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రభుత్వ సమగ్రాసుపత్రి మార్చురికీ తరలించారు. ఎరుపు రంగు టీషర్ట్, నలుపు రంగు ప్యాంట్ ఉన్న మృత దేహం ఆచూకీ తెల్సిన వారు 72070 76614, 0863–2220753 నంబర్లకు సమాచారం తెలియజేయాలని ఎస్ఐ కోరారు.

NEC NARASARAOPETA ENGINEERING COLLEGE (AUTONOMOUS)
Accredited by NBA(ECE, CSE & Mech.) - (Tier-1)& NAAC with 'A+'Grade (Cycle-2)
Approved by AICTE & Permanently Affiliated to JNTUK, Kakinada
Kotappakonda Road, NARASARAOPET - 522601, Palnadu (Dt), A.P.
www.nrtec.in email: neccareers@nrtec.in Cell: 9154686204
WALK-IN INTERVIEWS
Date : 25-05-2024 (Saturday) Time : 10.00 A.M. Venue : College Campus
The Following Departments require well - qualified academic Professionals for the positions of
Professor/Associate Professor/ Assistant Professor
CSE, IT, CSE (AI), CSE (AI&ML), CSE (CS), CSE (DS), Civil, EEE, Mech. English, Mathematics, Chemistry, MBA, MCA
Network/System Administrators / Hardware Technicians
Programmers in CSE - (B.Tech/B.Sc (Computers), M.Sc (Computers) - (C, Java, Python))
Lab Technicians - Civil Engineering, Clerks
Qualification, Experience & Salary as per AICTE Norms
M.S.Chakravarthi, B.E., M.S.(USA), Exec. MBA (ISB) Vice Chairman
Principal

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

TO-LET
■ 5 Bed and 4 bath rooms, Duplex flat for rent on the 3rd floor in postal colony, Guntur-522002.Please contact whatsapp number 7036755190, 8978838648

SERVICES

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 91699 22299

WANTED
■ రేపల్లె దగ్గరున్న భారత్ పెట్రోల్ బంకులో పనిచేయుటకు ఆసక్తి కలవారు కావలెను. చదువు వయస్సు అనుభవం ఇంత కావాలనే నిబంధన లేదు. వసతి+మంచి జీతం+శిక్షణ ఇవ్వబడును. మొదట చేరిన వారికి జీతంలో ప్రాధాన్యత ఇవ్వబడును. 9246164672
■ ప్రముఖ విద్యాసంస్థ నందు పనిచేయుటకు టెలికాలర్స్ మరియు తెలుగు DTP ఆపరేటర్ కావలెను. జీతం + బీమాషన్ అర్హత: 10 ఆపైన 2/2 బ్రాడీపేట, గుంటూరు. 9676123463
■ గుంటూరు అరండల్‌పేట 9/2 నందు బాలాజీ నిలయం ఈస్ట్ ఫేసింగ్ 1st ఫ్లోర్ గల 12x10 షాపు ఆఫీసులకు కానీ ఇతర కమర్షియల్ కానీ అద్దెకు ఇవ్వబడును. 8125175176
■ Young & Good Looking Female Tele Caller & Receptionist to Join Our Multinational Trading Company with Communication Skills in Telugu, English & Basic Computer Knowledge ✆ 9676515257, Guntur
■ అనుభవం గల సేల్స్ మెన్స్ కావలెను. మమత మెడికల్స్, గవర్నమెంట్ హాస్పిటల్ వద్ద, గుంటూరు. సంప్ర॥ ✆9849478518, 9846560016, 0863–2224688
■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైమ్ మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500rs. మీ పేరు, కాల్ / వాట్సప్ చేయగలరు. 7032856389
■ Wanted Motivators for admission of students to paramedical Eligibility: Soft spoken language Contact: 8332004478, 9848134028
■ స్మైల్ డెంటల్ క్లినిక్స్ నందు పనిచేయుటకు లేడీ డెంటల్ చైర్ అసిస్టెంట్స్ కావలెను. బృందావన్ గార్డెన్స్, గుంటూరు. ✆ 8919067356
■ వంట మనిషి కావలెను: గుంటూరు పట్టణము లో ఏ.టి.అగ్రహారం నందు గృహములో వెజ్ మరియు నాన్‌వెజ్‌లో అన్ని రకముల వంటలు చేయుటకు అనుభవము కలిగిన (ఆడ) వంట మనిషి కావలెను. ✆ 9398991579
■ 10th, ఇంటర్, డిగ్రీ, B.Tech చదివి ఖాళీగా ఉంటున్నవారికి ఆఫీసులు, షోరూమ్‌లు, షాపింగ్ మాల్స్ Ltd కంపెనీల్లో మా సంస్థ ద్వారా ప్లేస్‌మెంట్స్ కల్పన. ట్రస్ట్ ఆఫీస్ వర్క్. 99632 55441
■ గుంటూరు, లాలాపేట, ఫ్రూట్ మార్కెట్ వద్ద గల జ్యూయలరీ షోరూమ్ నందు పనిచేయుటకు యువతీ యువకులు కావలెను. వ:18-25సం॥ ✆7095946402, 7702472081
■ WANTED TEACHERS PRIMARY -TELUGU, HINDI, SOCIAL MATHS, ENGLISH, SCIENCE HIGH SCHOOL - SOCIAL, ENGLISH BRK HIGH SCHOOL KOTHAPET, CHIRALA ✆ 88854 36812
■ తెనాలి దగ్గర దుగ్గిరాల ప్రముఖ కాఫీ పరిశ్రమలోకి సెక్యూరిటీ గార్డులు కావెను. వీక్లీ ఆఫ్ & క్యాంటీన్ వసతి (8 గం॥ డ్యూటీ) జీతం: 14750/- ✆ 99489 11777, 98489 77496
■ సేంద్రీయ ఎరువుల మార్కెటింగ్ కొరకు యువకులు కావలెను. Q: 10th to Degree, Contact: 63006 72800
■ సాయి శ్రీ ఎంటర్‌ప్రైజెస్ నందు పర్మినెంట్ ఎంప్లాయిగా పనిచేయుటకు IT Returns, GST ఫైలింగ్ చేయుటకు అనుభవం గల Male / Female అకౌంటెంట్ కావలెను. ఫోన్ : 98828 65527
■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167541
7075167663

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వారా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

డెంగీ నివారణ చర్యల పరిశీలన

డ్రై డేపై ఎన్‌వీబీడీసీపీ సభ్యులకు సూచన



డీఎంహెచ్‌వో డాక్టర్ రవితో సమావేశమైన ఎన్‌వీబీడీసీబీ టీం సభ్యులు

నరసరావుపేట: జిల్లాలో డెంగీ నివారణ కోసం నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమ (నేషనల్ వెక్టర్ బర్న్ డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రాం –ఎన్‌వీబీడీసీపీ) టీం సభ్యులు పరిశీలించారు. శుక్రవారం పల్నాడు రోడ్డులోని జిల్లా మలేరియా కార్యాలయాన్ని సందర్శించి అన్నీ మలేరియా యూనిట్ అధికారులతో సమావేశం నిర్వహించి డెంగీ నివారణపై తీసుకుంటున్న చర్యలపై వారిని విచారించారు. టీఎం సభ్యులు పార్వతీశం, విజయరాజు, సుబ్రమణ్యంలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రవీంద్ర రత్నాకర్‌లతో సమావేశమయ్యారు. డెంగీ నివారణకు ఏం చర్యలు తీసుకుంటున్నారో విచారించారని డాక్టర్ రవీంద్ర రత్నాకర్ వెల్లడించారు. సెంటినల్ సర్వై లెన్స్ హాస్పిటల్‌లోని జిల్లా మలేరియా ల్యాబ్‌ను సందర్శించి రక్తపూతల సేకరణ, నమూనా సేకరణ, పరీక్ష విధానాల గురించి తగిన సూచనలు చేశారన్నారు. ప్రతీ గృహంలో నీరు నిల్వ ఉండే అవకాశం ఉంటే దోమలు గుడ్లుపెట్టి ఏడు నుంచి పది రోజుల్లో దోమలుగా మారి మలేరియా, డెంగీ, చికున్ గున్యా, ఫైలేరియా, మెదడు వాపు వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ఆశ, ఏఎన్‌ఎం, సూపర్ వైజర్లు ద్వారా ఫ్రైడే డ్రైడేను పకడ్బందీగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారన్నారు. పట్టణంలోని ఇస్లాంపేటలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని సందర్శించి వీక్షించారు. ముప్పాళ్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. సబ్ యూనిట్ అధికారి కె.శ్రీనివాసరావు, ఏఎంవో చుక్కా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పది మంది నిందితులకు బెయిల్

రెంటచింతల: మండలంలోని రెండు గ్రామాల్లో ఈ నెల 13న నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల సమయంలో పోలింగ్ బూత్‌లలోని ఈవీఎంలను ధ్వంసం చేసిన ఘటనలో 10 మంది నిందితులకు శుక్రవారం నరసరావుపేట పీడీఎం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ నెల 20న ఎస్ఐ ఎం.ఆంజనేయులు నిందితులను అరెస్టు చేశారు. తుమ్మకోట గ్రామంలో ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనలో టీడీపీకి చెందిన పోట్ల సతీష్, జంగాల కోటేశ్వరరావు, మిద్దెపోగు మహేష్, జంగాల సైదులు, జెట్టిపాలెం గ్రామంలో ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనకు సంబంధించి వైఎస్సార్ సీపీకి చెందిన కుందురు నర్సింహా రెడ్డి, మేకపోతుల శివారెడ్డి, కేతావత్ మంగ్లా నాయక్, కొండా రామయ్య, తిక్కా శ్రీనివాసరావు, పేర్ల శివరామ్‌లను నర్సరావుపేట పీడీఎం కోర్టులో హాజరు పెట్టగా వారిని రిమాండ్‌కు పంపించడం జరిగింది.

పలు రైళ్లు రద్దు

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ శుక్రవారం వెల్లడించారు. రైలు నంబరు 17228 (గుంటూరు – డోన్), రైలు నంబరు 17329 (హుబ్లీ–విజయవాడ), రైలు నంబరు 07791 (కాచిగూడా – నడికుడి), 07792 (నడికుడి – కాచిగూడా)లను జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు రద్దు చేసినట్లు తెలిపారు. రైలు నంబరు 17227 (డోన్ – గుంటూరు) జూన్ 1 నుంచి జులై 1వ తేదీ వరకు, 17330 (విజయవాడ – హుబ్లీ) రైలు జూన్ 2 నుంచి జులై 1వ తేదీ వరకు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. 17282 (నర్సాపూర్ – గుంటూరు) జూన్ 1నుంచి 30వ తేదీ వరకు విజయవాడ – గుంటూరు మధ్య తాత్కాలికంగా రద్దు చేసినట్లు పేర్కొన్నారు. 17281 (గుంటూరు – నర్సాపూర్) జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు గుంటూరు – విజయవాడ మీదుగా తాత్కాలికంగా రద్దు చేశామని, ప్రయాణికులు గమనించాలని ఆయన కోరారు.

దాడి కేసులో పది మంది అరెస్ట్

నరసరావుపేట టౌన్: కారు అద్దాలు ధ్వంసం చేయటంతో పాటు డ్రైవర్‌పై దాడి చేసిన కేసులో పది మందిని అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ భాస్కర్ శుక్రవారం తెలిపారు. ఎన్నికల పోలింగ్ నాడు మున్సిపల్ బాలుర పాఠశాల ఎదుట నిలిపి ఉన్న కారును దుండగులు ధ్వంసం చేశారు. అడ్డుకున్న కారు డ్రైవర్ మక్కెన అంకమ్మరావుపై దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం పట్టణానికి చెందిన వై. ఈశ్వరరెడ్డి, జహిరుద్దిన్, గణేష్, షేక్ సుభానితో పాటు మరో ఆరుగురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి రిమాండ్ విధించటంతో నిందితులను రాజమండ్రి సెంటర్ జైలుకు తరలించారు.

హెల్మెట్ సహితం..కాదు ప్రాణాంతకం

- రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న ద్విచక్ర వాహనదారులు
- అందులో అధిక శాతం హెల్మెట్ లేని ప్రయాణాలే కారణం
- చిన్నపాటి రక్షణ చర్యలతో తప్పుతున్న ప్రాణాపాయం
- వాహనదారుల్లో స్వీయ చైతన్యం అవసరమంటున్న అధికారులు

ఇటీవల బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం పోలూరు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు తాళ్లూరి వినోద్ కుమార్ బైకు అదుపు తప్పి కింద పడిపోయారు. తలకు బలమైన గాయమై అక్కడికక్కడే ఆయన మృతి చెందారు. అలాగే నగరం మండలం ఉల్లిపాలేనికి చెందిన ఓ యువకుడు పేటేరు నుంచి వెళ్తూ ఓలేరు సమీపంలో ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి కింద పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో హెల్మెట్ ధరించి ఉంటే చిన్నపాటి గాయాలతో బయటపడేవాడని పోలీసులు తెలిపారు. ఇటువంటి ఘటనలు జిల్లాలో అనేకం చోటుచేసుకుంటున్నాయి.



రేపల్లె రూరల్: హెల్మెట్ రహిత ప్రయాణం ప్రమాదకరమని తెలిసినా ద్విచక్ర వాహనదారులు నిర్లక్ష్యం వీడడం లేదు. అతివేగం, అజాగ్రత్త కారణాలుగా తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో హెల్మెట్ లేక పోవడంతో తలకు బలమైన గాయాలయ్యి.. ప్రాణాలు కోల్పోతున్నారు. దీంతో మృతుల కుటుంబ సభ్యులు బాధితులుగా కుమిలిపోతున్నారు.

చిన్నపాటి జాగ్రత్తలతో సురక్షితంగా గమ్యానికి..

చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించడంతో పాటు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవచ్చునని పోలీసు అధికారులు చెబుతున్నారు. ద్విచక్ర వాహనాలపై దూర ప్రాంతాలకు వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేస్తున్నారు. కారులో ప్రయాణించే వారు డ్రైవర్‌తో పాటు సీట్ బెల్ట్ ధరించాలని చెబుతున్నారు.

ప్రమాదాల నివారణకు కఠినంగా వ్యవహరించాలి..

రహదారి ప్రమాదాలను నివారించడానికి పోలీసు అధికారులు కఠినంగా వ్యవహరించాలని ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు. నిరంతరం ప్రధాన కూడళ్లలో రహదారులపై తనిఖీలు నిర్వహించి, మైనర్లు నడిపే వాహనాలు స్వాధీనం చేసుకుని, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటూ అపరాధ రుసుం విధించాలని సూచిస్తున్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారికి కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు ప్రమాదాల తీవ్రతను వివరించాలంటున్నారు. పట్టణ ప్రాంతాల్లో రహదారులపై మైనర్ బాలురు ద్విచక్ర వాహనలపై ముగ్గురు నుంచి నలుగురు వరకు ఎక్కి ప్రయాణం చేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. అతి వేగంగా వాహనాలు నడపడం ప్రమాదాలకు మరో కారణంగా ఉంటోంది.



రేపల్లె పట్టణంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న నలుగురు బాలురు

పోలీసుల తనిఖీల్లో రాజకీయ జోక్యం తగదు..

ప్రమాదాల నివారణకు పోలీసులు తీసుకునే చర్యలకు రాజకీయ నాయకుల జోక్యం అడ్డుపడకూడదని ప్రజా సంఘాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. పోలీసుల తనిఖీల్లో డ్రైవింగ్ లైసెన్సు, హెల్మెట్ లేకుండా పట్టుబడిన వారిని వదిలేయాలంటూ రాజకీయ నాయకులు కలుగజేసుకోవడం మానుకోవాలని హితవు పలుకుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

రహదారి ప్రమాదాలను నివారించేందుకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఏటా జనవరి 11 నుంచి 17వ తేదీ వరకు రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా వాహన చోదకులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తూ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన సూచనలిస్తూ.. హెల్మెట్ ప్రాధాన్యతను వివరిస్తున్నాం. పరిమితికి మించి ప్రయాణికులతో నడిపే ఆటో డ్రైవర్‌లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం.

– ప్రసన్నకుమారి, ఎంవీఐ, బాపట్ల.

జంగాలపల్లిలో పోలీసుల తనిఖీలు

వినుకొండ (నూజెండ్ల): సార్వత్రిక ఎన్నికల అనంతరం పలు గ్రామాల్లో జరిగిన అల్లర్లకు పోలీసులు చెక్ పెట్టేందుకు కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా నూజెండ్ల మండలం జంగాలపల్లి గ్రామంలో శుక్రవారం ఐనవోలు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. గ్రామాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. గ్రామంలో మారణాయుధాలు, నాటుబాంబులు ఏమైనా ఉన్నాయోమో అని సోదాలు నిర్వహించారు. అదే విధంగా సరైన పత్రాలు లేని బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామ ప్రజలతో ఎస్ఐ లక్ష్మీ నారాయణ రెడ్డి మాట్లాడుతూ అల్లర్లకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని, ముఖ్యంగా యువత ఇటువంటి రాజకీయ అల్లర్లకు దూరంగా ఉండాలని హితవు పలికారు. ఓటును వినియోగించుకోవడం పౌరుడి ప్రాథమిక హక్కు అయితే రాజకీయ అల్లర్లకు దూరంగా ఉండటం నైతిక హక్కుగా ప్రతిఒక్కరూ భావించాలని తెలిపారు.



జంగాలపల్లిలో తనిఖీలో పాల్గొన్న పోలీసులు

సత్తెనపల్లిలో..

సత్తెనపల్లి: జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాల మేరకు పట్టణ సీఐ పోలూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పట్టణంలోని వెంగళ్శరెడ్డి నగర్‌లో పట్టణ పోలీసులు శుక్రవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గృహాల్లో విస్తృతంగా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పాత నేరస్తులు, అనుమానితులు, స్థానికేతర్ల కదలికలపై ఆరా తీశారు. తనిఖీల సందర్భంగా సరైన పత్రాలు లేని ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీన పర్చుకొని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ జూన్ 4న కౌంటింగ్ సందర్భంగా అల్లర్లకు ఆస్కారం ఉంటుందనే సూచనలు నేపథ్యంలో ఈ సెర్చ్ చేపట్టినట్లు తెలిపారు. ఆయనతో పాటు పట్టణ ఎస్ఐ ఎం. సత్యనారాయణ, పోలీసులు, మహిళా పోలీసులు, ఉన్నారు.



వెంగళ్శరెడ్డి నగర్‌లో తనిఖీ చేస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సత్యనారాయణ

శాంతిభద్రతలు కాపాడేందుకు సహకరించాలి

దాచేపల్లి : శాంతిభద్రతలు కాపాడేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని డీఎస్పీ జగదీష్ నాయక్ అన్నారు. సమస్యాత్మక గ్రామమైన కేసానుపల్లిలో శుక్రవారం కార్డెన్ చర్చ్‌ని నిర్వహించారు. గ్రామంలో అనుమానాస్పదంగా గుర్తించిన ప్రతి ఇంటిలో సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ జగదీష్ నాయక్ మాట్లాడుతూ.. ఎన్నికలు ముగిసిన తరువాత గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, గ్రామాల్లో రెచ్చగొట్టేలా మాట్లాడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎ. సురేంద్రబాబు, ఎస్ఐలు దాసరి శివనాగరాజు, జి.సంధ్యారాణి ఉన్నారు.



కేసానుపల్లి కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

రైతాంగం.. ధరహాసం

- ఖరీఫ్, రబీ పంటల దిగుబడులు ఆశాజనకం
- మార్కెట్ ధరలతోనూ రైతాంగం ఫుల్ జోష్

తెనాలి: నైరుతి రుతుపవనాలు ముందుగానే ప్రవేశిస్తాయని వాతావరణ శాఖ వెల్లడి నేపథ్యంలో వ్యవసాయశాఖ ముందస్తు ప్రణాళికతో రైతులను సంసిద్ధం చేసే పనిలో ఉంది. 2023–24 సంవత్సరానికి ఖరీఫ్, రబీ సీజన్లలో సాగుచేసిన పంటల దిగుబడులు ఆశాజనకంగా, మార్కెట్ ధరలు సంతృప్తికరంగా ఉన్నాయి. మాగాణిలో పండించిన వరి, జొన్న, మెట్ట పైరు పసుపు పంటకు, చివరగా కోతకొచ్చిన మొక్కజొన్నకు మార్కెట్లో మంచి ధరలు పలికాయి. దీంతో జిల్లా రైతులు సంతోషంగా ఖరీఫ్‌కు సన్నద్ధం కానున్నారు.



తెనాలి ప్రాంతంలో జొన్న కోత (ఫైల్)

'మొక్క'వోని ధైర్యం..

గుంటూరు జిల్లాలో రబీలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం అధికమని తెలిసిందే. ఇక్కడ మాగాణి భూముల్లో జీరో టిల్లేజ్ విధానంలో ఈ పంటను సాగుచేస్తున్నారు. పంటకాలంలో నాలుగు తడులు అవసరమైన మొక్కజొన్నకు జిల్లాలో సాధారణ విస్తీర్ణం 51,675 ఎకరాలు కాగా, నీటి లభ్యతను అంచనా వేసుకుని 33,656 ఎకరాల్లోనే సాగుచేశారు. ఏప్రిల్ రెండోవారం నుంచి మే 15వ తేదీ కల్లా కండె విరవటం పూర్తయింది. రైతు కష్టం వృథా పోలేదు. ఎకరాకు దిగుబడి 35–40 క్వింటాళ్లు వచ్చింది. పంట చేతికొచ్చే సమయానికి మార్కెట్లో ధరలు బాగున్నాయి. క్వింటా రూ.2000–2200 వరకు రైతులు అమ్ముకోగలిగారు.

● మొక్కజొన్న విస్తీర్ణం తగ్గినప్పటికీ ఆ పంటతో దాదాపు సమానంగా తెల్లజొన్న సాగును చేపట్టారు రైతులు. జిల్లాలో 32,550 ఎకరాల్లో తెల్ల జొన్న వేశారు. మొక్కజొన్నతో పోల్చుకుంటే ఈ పంటకు కేవలం రెండు నీటి తడులే సరిపోతాయి. దీనితో ఖర్చులు తక్కువ. ఈ పంటకూడా రైతులను నిరాశపరచలేదు. ఎకరాకు 25–30 క్వింటాళ్ల దిగుబడినిచ్చింది. పంట కోతకు వచ్చేముందు మార్కెట్ ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. అప్పట్లో క్వింటాలుకు రూ.2200 ఉన్నా, ఎన్నికల కోడ్ వచ్చిందంటూ మధ్య వ్యాపారులు రూ.200 తగ్గించారు.

'వరి'ంచిన అదృష్టం..

జిల్లాలో మాగాణి విస్తీర్ణం 1,52,411 ఎకరాలు కాగా, అందులో 1.37 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సీజనులో వరి సాగుచేసిన విషయం తెలిసిందే. పశ్చిమ డెల్టా పరిధిలోని తెనాలి డివిజనులోనే వరి సాగువిస్తీర్ణం అధికం. వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొన్నప్పటికీ పంట ఏపుగా పెరిగింది. కంకులు విరగగాచాయి. పంట చేతికొచ్చే డిసెంబరు నెలలో మిచాంగ్ తుఫాన్ రైతులను కలవరపెట్టింది. అయినాసరే, వరి దిగుబడులు రైతులను నిరాశపరచలేదు. ఎకరాకు 35–40 బస్తాల దిగుబడి వచ్చింది. తుఫాన్ తాకిడికి గురయిన చేలల్లో ఎకరాకు 4–5 బస్తాల తగ్గుదల వచ్చింది. మార్కెట్ ధరలు రికార్డు స్థాయిలో ఉండటంతో రైతాంగం దిల్‌ఖుష్‌గా అమ్మకాలు చేసుకుంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా కల్లాల్లోనే 75 కిలోల ధాన్యం బస్తాను రూ.1900–2100 చొప్పున వ్యాపారులు కొనుగోలు చేశారు.

పసుపు రైతుల్లో జోష్..

మెట్ట భూముల్లో పండించే పంటల్లో ప్రధానమైన పసుపునకు ఈ ఏడాది రికార్డుస్థాయి ధరలు పలకటం మరో విశేషం! జిల్లాలో 5,337 ఎకరాల్లో పసుపు సాగు చేశారు. ఎకరాకు సగటున 35 క్వింటాళ్ల దిగుబడి లభించింది. క్వింటాలు పసుపునకు మార్కెట్లో ఈసారి రూ.10 వేల నుంచి రూ.16 వేల వరకు ధరలు పలికాయి. 2004–09 మధ్యలో ఒకటి రెండేళ్లు పసుపునకు రికార్డుస్థాయి ధరలు వచ్చాయి. మళ్లీ ఇంతకాలానికి మంచి ధరలు రావటం పసుపు రైతుల్లో జోష్‌ను నింపింది.

ధరలు బాగున్నాయి



నేను తొమ్మిది ఎకరాలు కౌలు చేశాను. ఆరెకరాల్లో మొక్కజొన్న, మూడెకరాల్లో జొన్న వేశాను. మొక్కజొన్న 40 క్వింటాళ్ల చొప్పున దిగుబడి రాగా, క్వింటాలు రూ.2,130 వంతున అమ్ముకున్నాను. జొన్న దిగుబడి 30 క్వింటాళ్లు వచ్చింది. రూ.2050 చొప్పున విక్రయించా. ఖరీఫ్‌లో పండించిన వరిని బస్తా రూ.1700లకు కొనుగోలు చేశారు. మొత్తంమీద ఈ ఏడాది బాగుంది.

– బొంతు శివనాగిరెడ్డి, కౌలురైతు, చివలూరు

మొక్కజొన్న పంట సగం నిల్వచేశాను



నేను 15.60 ఎకరాలు కౌలు వ్యవసాయం చేశాను. పదెకరాల్లో మొక్కజొన్న వేస్తే 35 క్వింటాళ్ల వంతున దిగుబడి వచ్చింది. సగం పంటను క్వింటాలు రూ.2100కు అమ్ముకుని, ధర మరింత పెరుగుతుందని మిగిలింది నిల్వచేశాను. 5.60 ఎకరాల్లో వేసిన జొన్న 30 క్వింటాళ్ల చొప్పున వచ్చింది. రూ.2050కు అమ్మాను. ఖరీఫ్‌లో ధాన్యం ఎకరాకు 36 బస్తాలురాగా, బస్తా రూ.1950–2000 చొప్పున విక్రయించాను.

– సిద్దెల కిషోర్‌బాబు, కౌలు రైతు, చెముడుబాడు

పురోహితుడి ఇంట్లో చోరీ



దుండగులు పగులగొట్టిన బీరువా

దాచేపల్లి: ఇంటి యజమాని అయిన పురోహితుడు లేని సమయం చూసుకుని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఉన్న బీరువాను పగులగొట్టి రూ. 8 లక్షలు విలువ చేసే బంగారు నగలు, రూ.45 వేల నగదును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఇంటి యజమాని చోరీ జరిగినట్లుగా గుర్తించి పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. మండల పరిధిలోని కేసానుపల్లి గ్రామానికి చెందిన పానుగుపాటి ఆంజనేయశర్మ పురోహితుడిగా పనిచేస్తున్నాడు. గుంటూరులో ఉంటున్న బంధువులు చనిపోవడంతో అంత్యక్రియల్లో పాల్గొనేందుకు మంగళవారం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులంతా వెళ్లారు. బుధవారం రాత్రి ఇంటికి తిరిగి వచ్చారు. ఇంటికి వేసిన తాళం, బీరువా పగులగొట్టి బంగారు నగలు, నగదు చోరీ చేసినట్లుగా పురోహితుడు ఆంజనేయ శర్మ గుర్తించారు. తన ఇంట్లో చోరీ జరిగినట్లుగా గుర్తించిన ఆంజనేయశర్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎ. సురేంద్రబాబు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ప్రతి గురువారం ఉచితంగా టీబీ వ్యాక్సిన్

గుంటూరు మెడికల్: జిల్లాలో ప్రతి గురువారం పెద్దలకు గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచితంగా బీసీజీ వ్యాక్సిన్ వేయనున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. ఏపీలో కేస్ స్టడీ కింద పలు జిల్లాలు ఎంపిక చేశారని, వాటిలో గుంటూరు జిల్లా ఒకటని ఆమె పేర్కొన్నారు. జిల్లాలో టీబీ వ్యాక్సిన్ వేయించుకునేందుకు సమ్మతి తెలియజేస్తూ పత్రాలు ఇచ్చిన వారు 1.77 లక్షల మంది ఉన్నారని తెలిపారు. వాక్సిన్ ప్రక్రియ మే నుంచి జూలై వరకు కొనసాగుతోందని, సమ్మతి తెలియజేసిన వారందరూ తప్పకుండా వేయించుకోవాలని ఆమె కోరారు.

వ్యాక్సిన్‌కు అర్హులు

60 సంవత్సరాలు పైబడిన వారు, 18 నుంచి 60 సంవత్సరాలలోపు పొగ తాగేవారు, 18 నుంచి 60 సంవత్సరాల లోపు మధుమేహ వ్యాధిగ్రస్తులు, బాడీ మాస్ ఇండెక్స్ 18 కన్నా తక్కువ ఉన్నవారు, క్షయ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులు, 2018 నుంచి టీబీ బారినపడి చికిత్స పొందుతున్న వారు, 2021సంవత్సరం జనవరి 1 నుంచి టీబీ వ్యాధిగ్రస్తులతో కాంటాక్ట్‌లో ఉన్నవారు వ్యాక్సిన్ వేయించుకునేందుకు అర్హులని ఆమె తెలిపారు.

వీరికి వ్యాక్సిన్ అవసరం లేదు

18 సంవత్సరాల లోపలి వారు, గర్భిణులు, బాలింతలు, హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, క్యాన్సర్ పేషెంట్లు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, మూడు నెలల లోపల రక్త మార్పిడి చేయించుకున్న వారు, వ్యాక్సిన్ చేయించుకోవడానికి నిరాకరించిన వారు, బీసీజీ, ఇతర వ్యాక్సిన్లకు గతంలో తీవ్ర రియాక్షన్ వచ్చినవారికి అవసరం లేదని డాక్టర్ విజయలక్ష్మి వెల్లడించారు.